క్లుప్తంగా

నగదు రహిత చెల్లింపులు ప్రారంభం



ఉయ్యాలవాడ గ్రామ సచివాలయంలో డిజిటల్ చెల్లింపును పరిశీలిస్తున్న కార్యదర్శి

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులను ప్రారంభించామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీల జనాభాను బట్టి బ్యాంకు అధికారులు పీవైఎస్ మిషన్లు, క్యూ ఆర్ కోడ్లను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఇక మీదట ఇంటిపన్ను, కుళాయి పన్ను, పంచాయతీలకు సంబంధించిన చెల్లింపులన్నీ నగదు రహిత విధానంలోనే కొనసాగుతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



వనికినిదిన్నెలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

శిరివెళ్ల: నియోజకవర్గంలో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. శుక్రవారం వనికినిదిన్నె, జీనేపల్లెలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో 118 జగనన్న కాలనీలకుగాను 64 కాలనీల్లో 3,745 ఇళ్లు నిర్మాణాలు మొదలు కాగా అందులో 962 పూర్తయ్యాయని, అలాగే సొంత స్థలాల్లో 3,611 ఇళ్లు పూర్తియయ్యాయని చెప్పారు. నిర్మాణ దశల ఆధారంగా లబ్ధిదారులకు బిల్లులు మంజూరువుతున్నాయన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఏఈ నాగశేఖర్ ఉన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండండి



శిరివెళ్లలో పర్యటిస్తున్న అధికారులు

శిరివెళ్ల: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక తెలుగుపేటలో ఆరేళ్ల బాలుడికి డెంగీ వ్యాధి నిర్ధారణ అయ్యింది. శుక్రవారం బాలుడి నివాసం, పరిసరాలను పరిశీలించి జాగ్రత్తలు పాటించాలని స్థానికులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం జిల్లాలో 36 డెంగీ కేసులు నమోదయ్యాని, నంద్యాల పట్టణంలో 20 కేసులున్నాయని చెప్పారు. కూలర్లు, ఫ్రిజ్, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో మెలకువలు పాటించాలి



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ ఏడీ శ్రీనివాసులరెడ్డి

చాగలమర్రి: గొర్రెలు, మేకల పెంపకంలో పెంపకందారులు మెలకువలు పాటిస్తే ఆశించిన ప్రయోజనాలను పొందవచ్చని పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన గొర్రెల, మేకల పెంపకందారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో తెలియజేసే మేలైన యాజమాన్య పద్ధతులు తప్పక పాటించి లాభాలను ఆర్జించాలన్నారు. అనంతరం ప్యాపిలిలోని గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం మాస్టర్ ట్రైనర్ పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి, వీఏఎస్‌లు ప్రశాంతి, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. పశు వైద్యాధికారులు సాయిబాబా, రవి పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



డి.వనిపెంట చెంచుగూడెంలో డీడీటీ పిచికారీ చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో దోమల నిర్మూలన భాగంగా ఇళ్లల్లో డీడీటీని పిచికారీ చేయించారు. అనంతరం గ్రామంలోని కాలనీల్లో తిరిగి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో చెంచుగూడెం ప్రత్యేక అధికారి పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, అసిస్టెంట్ డీఎంఓ వరప్రసాద్, ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు కోటకందుకూరు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నిక
- ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్
- 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: కోటకందుకూరు గ్రామ పంచాయతీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం 7 గంటల నుంచి జరగనున్న పోలింగ్‌లో 3,240 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 5 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బూత్‌కు 810 ఓట్లను కేటాయించారు. ఒక్కో బూత్‌కు నలుగురు ఎన్నికల అధికారులను నియమించారు. శుక్రవారం మధ్యాహ్నం ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు బ్యాలెట్‌లు, ఎన్నిక సామగ్రితో ప్రత్యేక బస్సులో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

సాయంత్రానికి ఫలితాలు..

సర్పంచ్ ఎన్నిక బ్యాలెట్ విధానంలోనే జరగనుంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారు. జిల్లాలో జరుగుతున్న సర్పంచ్ ఉప ఎన్నిక ఇదొక్కటే కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఎన్నికను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. పరిశీలించిన అనంతరం కొత్తవారిని గ్రామంలోకి అనుమతిస్తున్నారు. పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘా మధ్య జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని వార్డు ఎన్నికకు అధికారులు ఏఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పల్లా శ్రీనివాసులు, బంధుగార్ల హుసేన్‌బాషా మధ్య ఎన్నికలు జరగనున్నాయి. వార్డులో మొత్తం 90 ఓట్లు ఉండగా పీఓగా ప్రసాద్, ఓపీఓగా సుదర్శన్‌రెడ్డి, స్టేజ్–2 రిటర్నింగ్ ఆఫీసర్‌గా కొండారెడ్డిని నియమించారు. పోలింగ్ సంబంధించిన ఎన్నికల సామగ్రిని అధికారులు సాయంత్రం అందజేశారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ నాగఅనసూయ ఏర్పాట్లను పరిశీలించారు.

చాగలమర్రి: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీలో 5వ వార్డు స్థానానికి శనివారం ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి రామచంద్రరావు తెలిపారు. ఏర్పాట్లను ఎంపీడీఓ మహబుబ్‌దౌలా పరిశీలించి,ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ఏఓ భరణి కుమారి, ఈఓపిఆర్‌డి సుదర్శన్‌రావు, పంచాయితి కార్యదర్శి స్వర్ణ కుమార్, సబియా ఉన్నారు.



ఎన్నికల సామగ్రితో అధికారులు



రుద్రవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రితో అధికారులు

పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సామగ్రి

రుద్రవరం: మండలంలోని పేరూరు పంచాయతీ 5వ వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు అధికారులు పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బంది రుద్రవరం మండల పరిషత్ కార్యలయం చేరుకోగా..ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రవీంద్రప్రసాద్ తదితరులు సామగ్రిని అప్పగించారు. శనివారం ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ, లెక్కింపు, ఫలితం వెలువరిస్తామని వివరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నెంబర్ 2లో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపారు. వివరాలు.. ప్లాట్‌ఫామ్ 2లో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉండవచ్చని, నీలం రంగు చొక్కా, గోధుమ రంగు పంచ ధరించి ఉన్నాడని, వివరాలకు సెల్ 9440627653 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆధారాలు లేకుండా విమర్శించడం తగదు

నంద్యాల(న్యూటౌన్): ఆధారాలు లేకుండా విమర్శించడం సరికాదని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి లక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయోభారంతో తాను పని చేయలేకపోతున్నానని, బదిలీ చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు రాజునాయుడు పేర్కొనడం తగదన్నారు. జిల్లాలోని బీసీ హాస్టళ్లను సమయం సందర్భం చూసుకొని తనిఖీ చేస్తామని, చేసే పనిలో తనకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గోమాతకు ఒడి బియ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని గోమాత విగ్రహానికి మహిళలు ఒడి బియ్యం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గోమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ నాగప్రసాద్, బాలుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఆధునికీకరణ పనులు

రుద్రవరం: మండలంలోని డి.కొట్టాల, శ్రీరంగాపురం గ్రామాల్లో విద్యుత్ ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు ఏఈ రాఘవేంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలు దెబ్బతిని సరఫరాకు అంతరాయం కల్పించేవి. సమస్యను సర్పంచ్ నరసింహారెడ్డి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు.. గ్రామంలో కిలోమీటరు పొడవునా కొత్త తీగలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే శ్రీరంగాపురంలో దెబ్బతిన్న పాత విద్యుత్ స్తంభాల స్థానంలో 20 కొత్త స్తంభాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



డి.కొట్టాలలో తీగలను సరిచేస్తున్న దృశ్యం

ప్రజాదరణను ఓర్వలేకే విపక్షాల విమర్శలు

శిరివెళ్ల: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణను చూసి విపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందపల్లె 1వ గ్రామ సచివాలయం పరిధిలోని 1, 2, 3 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మట్లాడుతూ గోవిందపల్లెలో నాలుగున్నరేళ్లలో రూ.2 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నవరత్నాల పేరిట రూ.28 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. సుదీర్ఘ కాలం పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు మేలు చేయాలనే తలంపు ఏనాడు చేయలేదన్నారు. ప్రతి ఎన్నికల ముందు ప్రచారంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే వాటిని చెత్త బుట్టలో వేయడం ఆయనకు రివాజుగా మారిందని విమర్శించారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల మహిళల రుణాలు, రైతు రుణాలు మాఫీచేస్తామని హామీ ఇచ్చారని, గెలిచిన తరువాత వారిని నట్టేట ముంచారన్నారు. దీంతోనే 2019లో ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. అయితే ఇచ్చిన మాటకు కట్టుబడటం, హామీలు నెరవేర్చడంలో జగనన్న ధీటు రాగలవారు లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచు మరియమ్మ, ఉప సర్పంచు ఇందూరి శేషారెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, సొసైటీ చైర్మన్ నర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ స్వాతి, కామినేనిపల్లె, వీరారెడ్డిపల్లె, బోయిలకుంట్ల సర్పంచ్‌లు మేర్వ చిన్ననరసింహారెడ్డి, రాధిక, జింకల నాగన్న, వంకదార సుబ్బ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శుక్రవారం 31వ వార్డు ఇస్లాం పేటలో కౌన్సిలర్ షేకిరెడ్డి అనురాధ, వార్డు ఇన్‌చార్జ్ విజయ భాస్కర్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో జనరల్ ఫండ్స్ నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించ తలపెట్టామన్నారు. డీఈఈ జయభారత రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

రుద్రవరం: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను తప్పని సరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ శ్రీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆలమూరు, చిత్రేనిపల్లి గ్రామాల పరిధిలో సాగుతున్న పంట నమోదు, ఆర్‌బీకేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వరి, మొక్కజొన్న, పత్తి, పసుపు తదితర పంటలు దాదాపు 4,500 హెక్టార్లలో సాగు చేశారన్నారు. ఆయా పంటలను రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని కోరారు. ఏఈఓ రాజు, వీఏఏలు ఫణి రాజశేఖర్, పవిత్ర ఉన్నారు.


మహానందిలో వైభవంగా లక్ష్మీహోమం

మహానంది: శ్రావణమాసం, తొలి శుక్రవారం పురస్కరించుకుని మహానంది ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు కామేశ్వరీదేవికి ప్రాతఃకాలంలోనే ప్రత్యేక అభిషేకం, పూలంగిసేవ, లక్ష్మీహోమం, శ్రీ చక్రపూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామమోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు ఈఓ ప్రసాదాలు పంపిణీ చేశారు.




అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఈఓ, పండితులు

ఉన్నతాధికారులకు మహానందీశ్వరుడి ప్రసాదాలు



జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి మెమొంటో అందిస్తున్న చైర్మన్, ఈఓ, పండితులు



ఎస్పీని సన్మానిస్తున్న ఈఓ, చైర్మన్‌లు

మహానంది: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు శుక్రవారం నంద్యాలకు వెళ్లి కలిశారు. ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జేసీగా రాహుల్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు అందుకున్న ఎస్పీని కలిసి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

నిందితులకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వేర్వేరు సంఘటనల్లో పట్టుబడిన మందు బాబులకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష శుక్రవారం ఖరారు చేశారని పోలీసు అధికారులు తెలిపారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యశ్వంత్, రాజీవ్, వెంకటసాయి, మధురాజశేఖర్, సాయితేజ, సునీల్ నిందితులు మద్యం మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి జడ్జీ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి ఐదు రోజుల జైలు శిక్ష ఖరారు చేశారు. మరో సంఘటనలో సాయిబాబానగర్‌లో అల్తాఫ్ హుసేన్ అనే నిందితుడు మద్యం సేవించి మహిళల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 30 రోజులు జైలు శిక్ష విధించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతి, బదిలీ ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని, జీవో నెం.117ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఫ్యాప్టో చైర్మన్ మాధవ స్వామి, సెక్రటరీ ఎం.సుబ్బన్న కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి 23వ తేదీన సీఎస్ఈ కార్యాలయం ఇబ్రహీంపట్నంలో జరిగే 12గంటల ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

నేడు రైతులతో సమీక్ష

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో సంజామల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన ఆర్‌బీకేల పరిధిలోని రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏఓలుతో పాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడీఏలు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొంటారని చెప్పారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

ఆళ్లగడ్డ: వినియోగదారులు తమ విద్యుత్ బకాయిలను చెల్లించి సంస్థకు సహకరించాలని విద్యుత్ డీఈ రవికాంత్ చౌదరి కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని 5 మండలాల పరిధిలో రూ.55 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం, ఇబ్బంది లేకుండా సేవలు అందిస్తున్నామని, వినియోగదారులు కూడా పెండింగ్ బిల్లులు చెల్లించి సంస్థ మనగడకు సహకరించాలని సూచించారు.

ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి


చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గో మహాపాదయాత్ర బృంద నాయకుడు వెల్లంకి వెంకటాచార్యులు కోరారు. ఇందుకోసం చేపట్టిన గో మహాపాదయాత్ర శుక్రవారం చాగలమర్రికి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ గురు స్వామి ఆధ్వర్యంలో 60 మంది ఈ నెల 6న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించామన్నారు. తిరుమల మీదుగా అరుణాచలం వరకు కొనసాగుతుందని చెప్పారు.

సుఖ ప్రసవాలను ప్రోత్సహించండి

నంద్యాలటౌన్: ఆశా కార్యకర్తలు గర్భిణులను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి సుఖ ప్రసవం అయ్యేందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి సూచనలు ఇవ్వాలని శిక్షకురాలు ప్రతిభ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నూతనంగా నియమించబడిన ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె పలు సూచనలు చేశారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

టమాట.. కాస్త ఊరట

- సామాన్యులకు అందుబాటులో ధర
- ప్రస్తుతం కిలో రూ.50 నుంచి రూ.60కే లభ్యం
- పెరిగిన విక్రయాలు
- మరింత తగ్గుతాయంటున్న వ్యాపారులు



టమోటాలు

నంద్యాల(వ్యవసాయం): అధిక ధరలతో వినియోగదారులకు చుక్కలు చూపించిన టమాటా ధర ప్రస్తుతం సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. రెండు నెలలుగా కిలో టమాటా ధర మూడంకెలపైనే కొనసాగింది. రూ.130 నుంచి రూ.180 వరకు ఎగబాకి, వినియోగదారులు గుండెల్లో గుబులు పుట్టించింది. ఆ ధరకు కొనుగోలు చేయలేక ఆ మాట ఎత్తడానికి కూడా వినియోగదారులు జంకారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో నంద్యాల రైతుబజార్ ద్వారా 8 టన్నుల టమాటాను కిలో రూ.50కే అందించింది. అయితే ఎట్టకేలకు ధర క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం రెండంకెలకు చేరుకోవడంతో విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రైతుబజార్లలో రూ.50, బయటి మార్కెట్లోకి రూ.60 ప్రకారం విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత దిగివస్తాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు.

దిగుమతి ఇలా..

జిల్లాలోని పలు ప్రాంతాల వ్యాపారులు టమాటా దిగుమతి చేసుకుంటారు. మదనపల్లి, తెలంగాణ ప్రాంతాల నుంచి టమాట దిగుబడి కొన్నాళ్లుగా పెరిగింది. దీంతో మార్కెట్‌లో లభ్యత పెరిగి, టమాటా ధరలు తగ్గుతున్నాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. ధరలు సాధారణంగా ఉన్న రోజుల్లో జిల్లాకు రోజుకు దాదాపు 18 నుంచి 20 టన్నుల వరకు దిగుమతి అయ్యేవి. కిలో ధర రూ.100 నుంచి రూ.180 వరకూ పలికిన సమయంలో 3 టన్నులు కూడా దిగుమతి అయ్యేవి కాదు. గ్రామాల్లో పండే దేశవాళీ టమాటా ఏటా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే లభ్యమవుతుంది. మిగిలిన సమయాల్లో మదనపల్లి, పత్తికొండ, అనంతపురం, పుంగనూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు.

10 కిలోలు అమ్మడమే కష్టమయ్యేది



ధరలు సాధారణంగా ఉన్నప్పుడు 80 నుంచి 100 కిలోల టమాటాలు దిగుమతి చేసుకొని, పూర్తిగా విక్రయించేవాళ్లం. కొద్ది రోజుల క్రితం ధర పెరిగిన సమయంలో 20 కిలోలు దిగుమతి చేసుకున్నా అందులో 10కిలోలు అమ్మడమే కష్టమయ్యేది. ప్రస్తుతం కిలో టమాటా రూ.50కే విక్రయిస్తున్నాం.

– సాదిక్, టమాటా వ్యాపారి, నంద్యాల

మరింత తగ్గుతాయి

టమాటా ధరలు వారం రోజుల్లో మరింత తగ్గుతాయి. కిలో రూ.30 నుంచి రూ.20కే తగ్గే అవకాశం ఉంది. ధరలు అధికంగా పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్‌లో కిలో టమాటాను రాయితీపై రూ.50కే వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతుబజార్ ద్వారా 8 టన్నుల టమాటా వినియోగదారులకు విక్రయించాం. ప్రస్తుతం ధరలు తగ్గుతున్నందున రైతుబజార్లలో రాయితీపై విక్రయాలు నిలిపివేశాం.

– సురేష్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి, నంద్యాల

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి శ్రావణమాసం, శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజల అనంతరం పల్లకీసేవ కనులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకిసేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఆరుతడి పంటలకే నీరు

రుద్రవరం: తెలుగుగంగ ద్వారా వచ్చే నీటిని కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే పారించుకోవాలని ఈఈ శంకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని డి.కొట్టాల, అప్పనపల్లె, రుద్రవరం గ్రామాల పరిధిలోని 17, 18, 19 ఉప ప్రధాన కాలువలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కాలువ పరిధిలోని ఆయకట్టు పొలాల్లో సాగు చేసిన పంటలను గమనించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. తెలుగుగంగ నీటిపై ఆధారపడి వరి పంట సాగు చేయవద్దని సూచించారు. కేవలం వాడుముఖం పట్టిన పంటలను కాపాడుకునేందుకు మాత్రమే నీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు.